సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 25 । జూన్ । 2023



సిరిసిల్ల: వర్షాలు ఆలస్యమైనప్పటికీ అదను దాటలేదని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. జూలై 15వ తేదీ వరకు విత్తనాలు విత్తుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వడ్డెపల్లి భాస్కర్ తెలిపారు. వానాకాలం సీజన్ నేపథ్యంలో 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ఇన్ నిర్వహించింది. జిల్లాలోని నలుమూలల నుంచి పలువురు రైతులు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వరి అయితే 120 నుంచి 130 రోజుల్లో కోతకు వచ్చే స్వల్పకాలిక రకాలను విత్తుకోవాలని, పత్తి విత్తనాలు ఇప్పటికే వేసిన రైతులు మొలకశాతాన్ని బట్టి తప్పుడు గుడ్డలు పెట్టుకోవాలని సూచించా రు. వ్యవసాయాధికారి(టెక్నికల్) పూర్ణిమతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సమాధానాలు ఇచ్చారు. ఆ విశేషాలు ఇవీ...

అదను దాటలేదు.. ఆందోళన వద్దు

- వానలు ఆలస్యమయ్యాయి
- జూలై 15 వరకు విత్తుకోవచ్చు
- నేరుగా విత్తనాలనే చల్లుకోవచ్చు
- 'సాక్షి' ఫోన్ఇన్‌లో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

ప్రశ్న: వర్షాలు ఆల్యస్యమయ్యాయి. వానాకాలం కార్తెలు వెళ్లిపోతున్నాయి. వరి సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– గుడి శ్రీనివాస్‌రెడ్డి(తడగొండ), దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్(నిమ్మపల్లి), రత్నాకర్(నర్మాల), వరి వెంకటేశ్(పోత్గల్), మహేశ్(ముస్తాబాద్), వెంకటేశ్(వీర్నపల్లి), బంధారపు బాల్‌రెడ్డి(ఎల్లారెడ్డిపేట), రవీందర్‌రెడ్డి(మూడపల్లి)

సమాధానం: వర్షాలు ఆలస్యమైన మాట వాస్తమే కానీ. ఇంకా అదను దాటలేదు. జూలై 15 వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. వరిలో స్వల్పకాలిక రకాలైన 1010, తెలంగాణ సోనా, కూనారం, జేజీఎల్ వంటి 120 రోజుల్లో కోతకు వచ్చే రకాలను వేసుకోవాలి. రైతులు నారు మడి పోయకుండా నేరుగా నాగటి సాళ్లలో, డ్రమ్‌సీడర్ ద్వారా విత్తనాలు చల్లుకుంటే.. నెల రోజుల కాలం కలిసి వస్తుంది. రైతులకు ఎకరానికి రూ.5వేల నుంచి రూ.6వేలు ఆదా అవుతాయి. మంచి దిగుబడి కూడా వస్తుంది. నేల స్వభావం ఆధారంగా తుకం పోయకుండా నేరుగా విత్తుకుంటే మంచిది.

ప్రశ్న: వర్షాలు లేవు, నేలలో తడి లేదు.. ఈ మధ్యనే పత్తిని విత్తుకున్నాం. ఇంకా మొలకెత్త లేదు. ఏం చేయాలి?

– తోట శేఖర్(పోశెట్టిపల్లి), దప్పుల సంతోష్(నిమ్మపల్లి), పవన్(లక్ష్మీపూర్), ప్రశాంత్‌గౌడ్(సర్దాపూర్)

సమాధానం: భూమిలో తడి లేకుండా విత్తనాలు వేసుకోవద్దు. వర్షాలు 50 నుంచి 60 మిల్లీమీటర్లు కురిసిన తరువాతే విత్తకోవాలి. జిల్లాలో అక్కడక్కడ కొద్దిగా వర్షాలు పడ్డాయి. మొలక శాతం తక్కువగా ఉంటే తప్పుడు గుడ్డలు పెట్టుకోవాలి. పత్తి విత్తనాలు ఏడు రోజుల్లో మొలకెత్తే అవకాశం ఉంటుంది. వర్షాలు వస్తున్నట్లు సంకేతాలు ఉన్నాయి.

ప్రశ్న: పత్తి విత్తనాలు పెట్టిన, డ్రిప్ ఉంది నీరు పెడుతున్న. అడుగు మందు ఏం వేసుకోవాలి?

– నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి(దేశాయిపల్లి)

సమాధానం: నీటి వసతి ఉంటే డీఏపీ ఎకరానికి బస్తా లేదా 20:20:13 ఎకరానికి రెండు బస్తాలు వేసుకోవాలి. అరకిలో పొటాష్ వేస్తే మంచిది.

ప్రశ్న: వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీ విత్తనాలు ఏం అందిస్తున్నారు. జీలుగను ఎన్ని రోజుల్లో దున్నాలి?

– బాలయ్య(పోత్గల్)

సమాధానం: వ్యవసాయశాఖ ద్వారా విత్తనాల సబ్సిడీ ఏం లేదు. జీలుగ విత్తనాలను 33 శాతం రాయితీపై అందిస్తున్నాం. జీలుగను వేసుకున్న 45 రోజుల్లో పూత రాకముందు నేలలో కలియదున్నాలి. సేంద్రియ ఎరువుగా మారుతుంది.

ప్రశ్న: వ్యవసాయశాఖ భూసారపరీక్షలు చేస్తుందా? ప్రైవేటుగా మేం చేసుకోవచ్చా? నేనే కూరగాయల సాగు చేయాలనుకుంటున్నాను?

– రాజు(పోత్గల్)

సమాధానం: ప్రస్తుతం వ్యవసాయశాఖ ద్వారా భూసార పరీక్షలు చేయడం లేదు. శ్యాంపిల్ తీసే విధానాన్ని మేం చెబుతాం. మీరు ప్రైవేటుగా పరీక్షలు చేయించుకోవచ్చు. లేదా మా ద్వారా కరీంనగర్ పంపించి పరీక్షలు చేయిస్తాం. నల్లరేగడి కాకుండా ఏ నేల అయినా కూరగాయల సాగుకు అనుకూలం. ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించండి.

ప్రశ్న: వరిలో కల్తీ విత్తనాలను ఎలా గుర్తించాలి?

– రాజవీరు(గంభీరావుపేట)

సమాధానం: ఏ విత్తనమైన చూసిన వెంటనే గుర్తించలేం. మొలకశాతాన్ని బట్టి తెలుస్తుంది. 90 శాతం మొలక వస్తే మంచిదే. మేం విత్తనాల శ్యాంపిళ్లు ర్యాండమ్‌గా తీస్తాం. మా పరీక్షల్లో నకిలీది, మంచిది తెలుస్తుంది.

ప్రశ్న: అకాల వర్షాలతో పంటలను కోల్పోయిన రైతులకు పరిహారం వచ్చిందా?

– శ్యామంతుల అనిల్(ఎల్లారెడ్డిపేట)

సమాధానం: జిల్లాలో మార్చిలో కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు 192 ఎకరాలకు రూ.19.20 లక్షల పరిహారం వచ్చింది. రైతుల ఖాతాల్లో జమైంది. ఏప్రిల్‌లో పంట నష్ట పరిహారం ఇంకా రాలేదు. మేం నివేదిక పంపించాం.

ప్రశ్న: కందులు ఎప్పటిలోగా వేసుకోవాలి? పత్తిలో గడ్డి మందులు చల్లవచ్చునా?

– భూంరెడ్డి(కనగర్తి)

సమాధానం: జూలై 15లోగా కందులను విత్తుకోవచ్చు. పత్తిలో అంతరపంటగా వేసుకోవచ్చు. వర్షాలు ఆలస్యమైతే కంది విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం. గడ్డిమందు చల్లుకోవచ్చు. పత్తి, వరి పంటలకు బదులుగా ఆయిల్‌పామ్ సాగుచేస్తే ఇంకా బాగుంటుంది.

ప్రశ్న: మేం 1010 రకం నారు పోసుకున్నాం. 20 రోజులు అవుతుంది. ఎండలకు నారు చనిపోతుంది. ఏం చేయమంటారు?

– రమేశ్(చిన్నబోనాల)


సమాధానం: నారుమడిని చూస్తేనే ఏమైనా చెప్పవచ్చు. ఏఈవోను క్షేత్రస్థాయికి పంపిస్తాను. ఆయన పరిశీలించి సలహా ఇస్తారు. మీ ఏఈవోను కలవండి.

ప్రశ్న: సబ్సిడీపై పనిముట్లు ఇస్తున్నారా?

– బాలకృష్ణారెడ్డి(మరిగడ్డ)

సమాధానం: ప్రస్తుతం పనిముట్లు ఏమీ ఇవ్వడం లేదు. రైతుబంధు సాయాన్ని ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తుంది.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, నివేశన స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఆదాయం కోసం రియల్ వెంచర్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ విమర్శించారు. అర్హులైన పేదలకు తొమ్మిదేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించడంలో మొండిచేయి చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేద మహిళలతో సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసు ముందు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు రాని వారికి ఇంటిస్థలాలతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్డీవో ఆఫీస్‌లో వినతిపత్రం అందించారు. సూరం పద్మ, మోర అజయ్, గోవిందు లక్ష్మణ్, ఎలిగేటి రాజశేఖర్, సురేష్, తిరుపతి, బాబు, సత్యనారాయణ, కవిత, లావణ్య పాల్గొన్నారు.

డీవైఎస్‌వోగా అజ్మీరా రాందాస్



సిరిసిల్ల: జిల్లా యువజన, క్రీడా అధికారిగా అజ్మీరా రాందాస్‌ను నియమిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఎల్లారెడ్డిపేట జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాందాస్‌ను డీవైఎస్‌వోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో నియమించారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన రాందాస్ మూడు దశాబ్దాలుగా వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ జిల్లాలో క్రీడల నిర్వహణలో భాగస్వాములయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్న రాందాస్‌ను జిల్లా యువజన, క్రీడాధికారిగా నియమించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీవైఎస్‌వోగా ఉన్న పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్‌రావు నుంచి రాందాస్ బాధ్యతలు తీసుకోనున్నారు.



కూతురును కొత్తపల్లి హైస్కూల్‌లో దింపుతున్న సదానందం

చిన్నచూపు తొలగాలని..

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ రేకుర్తిలో నివసిస్తున్న కొడికాల సదానందం దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితుడు. కూతురు కొడికాల చతురను ప్రభుత్వపాఠశాలలో చదివించాలని భావించారు. కొత్తపల్లి జెడ్పీపాఠశాలలో ఏడో తరగతిలో ప్రవేశం పొందిన చతుర ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. దివ్యాంగుడైన సదానందం నిత్యం చతురను పాఠశాలలో దింపి ఉద్యోగానికి వెళ్తారు. సాయంత్రం ఇంటికి తీసుకెళ్తారు. ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు తొలగాలని తన కూతురిని ఇక్కడ చదివిస్తున్నట్లు సదానందం వెల్లడించారు.

- మెరుగైన బోధన.. కార్పొరేట్ సౌకర్యాలు
- ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు

సండే స్పెషల్

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల పిల్లలు

సర్కారీ బడికే జై కొడుతున్నారు ప్రభుత్వ టీచర్లు. ఇంగ్లిష్ మీడియంలో బోధన.. కార్పొరేట్‌కు దీటైన వసతులు ఆకర్షితులను చేస్తున్నాయి. ప్రైవేట్‌కు పంపే స్థోమత ఉన్నా.. ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాలు.. విద్యాబోధన గురించి తమ పిల్లల ద్వారానే వివరిస్తూ మిగతా వారిని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం 'మన ఊరు – మన బడి', 'మన బస్తీ – మన పాఠశాల' పేరుతో సౌకర్యాలు మెరుగుపరచడం.. యూనిఫాం.. పుస్తకాలు.. నోట్‌బుక్స్.. రుచికర మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తుండడం ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి మళ్లేలా చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదవిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయులపై ఈ వారం సండే స్పెషల్..

సర్కారుబడి తక్కువేం కాదు



కొడుకు అభిజ్ఞతో భారతి

కోరుట్ల: మండలంలోని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాల టీచర్లు రాజు, భారతి పిల్లలను తాము పనిచేసే బడిలోనే చదివిస్తున్నారు. రాజు పెద్ద కొడుకు సిద్ధసాయి 5వతరగతి, చిన్న కొడుకు విశ్వ 1వ తరగతి, భారతి కొడుకు అభిజ్ఞ 4వ తరగతి చదువుతున్నారు. పిల్లలను సర్కారు బడిలోనే చదివించడంలో నామోషీలేదని, పోటీపడి డీఎస్సీలో ప్రతిభ చూపామని, తమపై తమకు నమ్మకం ఉందని చెబుతున్నారు. తాము చదువు చెప్పే బడిలోనే తమ పిల్లలను చదివిస్తే ఊర్లోని తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని వివరించారు. సర్కార్ బడిలోనే తమ పిల్లలను చదివిస్తే భవిష్యత్ బాగుంటుందని పేర్కొన్నారు.



తిమ్మాపూర్ పాఠశాలలో కూతుర్ని దింపుతున్న శ్రీలత

దీటైన చదువులు

చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన కాపిల్ల శ్రీలత– నరేశ్ దంపతులు ప్రభుత్వ టీచర్లు. నరేశ్ కోనరావుపేట మండలం పల్లిమక్తలో, శ్రీలత ఆశిరెడ్డిపల్లెలో పనిచేస్తున్నారు. తిమ్మాపూర్‌లోనే నివాసముంటూ కూతురు సహస్రాన్వితను స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదివిస్తున్నారు. చందుర్తికి చెందిన బండ శంకర్ రామన్నపేటలో ఉపాధ్యాయుడు. కూతురు బండ సింధు చందుర్తి జెడ్పీ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. కొడుకు ఆశీష్ చందుర్తి ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు.

ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలకు..



ఎల్లారెడ్డిపేట:మండలంలోని దుమాలలో పనిచేస్తున్న మంతుర్తి రామచంద్రం కూతురు సహజను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదోతరగతి వరకు చదివించారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుతుందనే సంకేతాన్ని తెలియజేయడానికి ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీ పాఠశాలలో ఆరోతరగతిలో చేర్పించాడు. ఎలగందుల దేవరాజు అనే ప్రధానోపాధ్యాయుడు సైతం తన ఇద్దరు పిల్లలను తాను పనిచేసే పాఠశాలలో చదివించగా.. ఇటీవలి పదోతరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించారు.

ప్రభుత్వ చదువులే బెస్ట్




తమ పిల్లలతో నవీన్‌కుమార్- స్వర్ణలత

జగిత్యాల: జిల్లాలోని మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన జక్కుల నవీన్‌కుమార్– స్వర్ణలత దంపతులు ఎస్జీటీలు. ప్రస్తుతం కోరుట్లలో నివాసముంటున్నారు. స్వర్ణలత కోరుట్ల మండలం ధర్మారం ఎంపీయూపీఎస్‌లో, నవీన్‌కుమార్ మల్లాపూర్ మండలం వేంపల్లిలో పనిచేస్తున్నారు. వీరికి నిత్యశ్రీ, అన్విక ఇద్దరు కుమార్తెలున్నారు. స్వర్ణలత పనిచేస్తున్న స్కూల్‌లోనే నిత్యశ్రీ నాల్గో తరగతి, అన్విక ఫస్ట్‌క్లాస్ చదువుతున్నారు. పాఠశాలల్లోనే క్వాలిటీ చదువు ఉందని, ఇంగ్లిష్ మీడియం అందుతోందని, అందుకే తమ పిల్లలను ఇక్కడే చదివిస్తున్నట్లు వివరించారు.

తనతో పాటే ఇద్దరు పిల్లలు..

కాల్వశ్రీరాంపూర్: మడిపెల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఎస్జీటీ ఎనగంటి కవిత తన వృత్తికే ఆదర్శంగా నిలుస్తోంది. భర్త చిలువేరు సదాశివ మండలంలోని చందపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు. కవిత ఏడేళ్ల క్రితం కథలాపూర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వచ్చిన కొత్తలో పాఠశాలలో 21మంది పిల్లలే ఉండడంతో సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. సౌకర్యాలను వివరించారు. సర్పంచ్, పాలకవర్గ సభ్యుల పిల్లలను బడిలో చేర్పించేలా కృషిచేశారు. కవిత సైతం తన పిల్లలు మహ (5వ తరగతి), మను (1వ తరగతి)ని తాను పనిచేసే పాఠశాలలోనే చదివిస్తున్నరు. తనతో పాటు స్కూటీపై తీసుకొచ్చి, తీసుకెళ్తోంది. ఇప్పుడు పాఠశాలలో 40 మంది వరకు పిల్లలు చదువుతున్నారు.



తన పిల్లలతో పాఠశాలకు వస్తున్న ఎనగంటి కవిత




తన ఇద్దరు పిల్లలు శ్రావ్య, శ్రావణితో శ్రీనివాస్

తండ్రీకూతుళ్లు.. సర్కారు బడికే..

గోదావరిఖనిటౌన్: రామగుండం పరిధిలోని జనగామ జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు టి.శ్రీనివాస్ తన ఇద్దరు కూతుళ్ల శ్రావ్య, శ్రావణిని ఆదే పాఠశాలలో 8వ తరగతి చదివిస్తున్నారు. మంథని ముత్తారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ సైతం ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివారు. తన కూతుళ్లను సైతం తాను బోధించే పాఠశాలలోనే చదివిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు బాగుంటాయని, అందుకే తన పిల్లలనూ ఇక్కడే చదివిస్తున్నట్లు వివరించాడు.

తండ్రితో కొడుకు

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు హరికృష్ణ తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చదివిస్తున్నారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హన్మాజిపేటకు చెందిన తీగల నాగరాజు, వట్టిమల్ల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న హన్మాజిపేటకు చెందిన నందిని దంపతుల పిల్లలు ప్రణవి, విశ్వక్‌వర్ధన్‌ను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు.



హన్మాజిపేటలో తన కొడుకును పాఠశాలకు తీసుకెళ్తున్న టీచర్

తల్లి వెంట తనయ



తరగతి గదిలో తల్లిజయతో కూతురు తేజశ్రీ

రామగుండం: రామగుండం మండల పరిషత్ పాఠశాలలో మ్యాథమెటిక్స్/తెలుగు బోధించే ఆడెపు జయ తన కూతురు తేజశ్రీని ఇదే స్కూల్‌లో చదివిస్తున్నారు. భర్త సత్యనారాయణ సింగరేణి ఉద్యోగి. జయకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురును సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది. చిన్న కూతురు తేజశ్రీకి రెండోతరగతిలో ప్రవేశం కల్పించగా ప్రస్తుతం ఐదోతరగతి చదువుతోంది. తాను సైతం చిన్నప్పటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే విద్యాభ్యాసం చేశానని, ప్రభుత్వ పాఠశాలలోనే ఉద్యోగం చేస్తున్నానని, పిలలనూ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జయ వివరించారు.

తాను చదివిన స్కూల్‌లోనే



పాఠశాలలో కొడుకు విద్యావర్ధన్‌చారితో దేవేంద్రాచారి దంపతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన వోజు దేవేంద్రాచారి కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు. దేవేంద్రాచారి, శశికళ దంపతులకు అక్షరప్రియ, విద్యావర్ధన్‌చారి పిలలు. వీరిద్దరిని చీకోడు ప్రాథమిక పాఠశాలలోనే నర్సరీలోనే చేర్పించారు. అక్షర ప్రియ ఐదో తరగతి, విద్యావర్ధన్‌చారి మూడో తరగతి చదువుతున్నారు. తానూ చీకోడు ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉపాధ్యాయుడిగా ఎదిగానని, అదే పాఠశాలలో పిల్లలిద్దరిని చేర్పించానని దేవేంద్రచారి పేర్కొన్నారు.



స్కూటీపై కొడుకును స్కూలుకు తీసుకొచ్చిన టీచర్ శారద

ఆదర్శ దంపతులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీకి చెందిన అనిల్–శారద ప్రభుత్వ టీచర్లు. అనిల్ హరిపురం ముత్తారంలో, శారద రామగుండం మండలం నరసింహపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. శారద పనిచేసే పాఠశాలలోనే పెద్దకొడుకు శ్రీహన్‌ను ఒకటోతరగతిలో చేర్పించారు. ప్రస్తుతం మూడోతరగతి చదువుతున్నాడు. రెండోకొడుకునూ త్వరలోనే ప్రభుత్వపాఠశాలకు పంపిస్తామని అనిల్– శారద దంపతులు తెలిపారు.



పిల్లలను పాఠశాలకు తీసుకెళ్తున్న రాజనర్సయ్య

నలుగురు పిల్లలు సర్కారు బడికే..

మెట్‌పల్లి: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన పొట్ట రాజనర్సయ్య–స్వాతి దంపతులకు నలుగురు పిల్లలు. ముగ్గురు కొడుకులు రాజేంద్ర, రాజలింగం, రాజన్, కూతురు రాజలక్ష్మి రాజనర్సయ్య పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీ ప్రాథమికపాఠశాలలో ఉపాధ్యాయుడు. తన పిల్లలను మొదటి నుంచీ స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నాడు. ప్రస్తుతం పెద్దకొడుకు ప్రభుత్వ కళాశాల నుంచి ఇంటర్ పూర్తి చేశాడు. రెండో కొడుకు అదే కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మూడో కొడుకు, కూతురు చావిడి వద్ద ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిది, ఆరోతరగతి చదువుతున్నారు. తనకు చదువు చెప్పిన గురువుల పిల్లలూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకున్నట్లు రాజనర్సయ్య వివరించారు.

ఉద్యోగం చేసేచోటే..



పిల్లలను పాఠశాలకు తీసుకొస్తున్న వెంకటేశ్వర్లు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కరంకొండ వెంకటేశ్వర్లు పదేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇతని పిల్లలు రాకేశ్ 8వ తరగతి, కూతురు జీవణి 7వ తరగతి మొదటి నుంచి కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. నిత్యం తనతో పాటు స్కూల్‌కు తీసుకొచ్చి.. తనతో పాటే సాయంత్రం ఇంటికి తీసుకెళ్తాడు వెంకటేశ్వర్లు.



కొత్తగట్టు పాఠశాలలో కొడుకుతో శ్రీనివాస్

చిన్నప్పటి నుంచే..

శంకరపట్నం: హుజూరాబాద్‌లో నివాసం ఉండే బోడ శ్రీనివాస్ ఎస్జీటీ. ప్రస్తుతం మండలంలోని రాజాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని మెట్‌పల్లిలో పనిచేసినప్పుడే తన కొడుకు సుశాంత్‌ను తను విధులు నిర్వహించే పాఠశాలలోనే ఒకటో తరగతిలో చేర్పించారు. తనతోపాటు బైక్‌పై కొడుకును తీసుకొచ్చేవారు. డిప్యూటేషన్‌పై కొత్తగట్టుపాఠశాలకు వెళ్లడంతో సుశాంత్‌ను సైతం కొత్తగట్టులో చేర్పించారు. ఇప్పుడు బదిలీపై రాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లడంతో 9వ తరగతి చదివే సుశాంత్‌ను నిత్యం కొత్తగట్టు పాఠశాలలో దింపి విధులకు వెళ్తున్నారు.

క్లుప్తంగా

రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

బోయినపల్లి (చొప్పదండి): అధిక సాంద్రత పద్ధతిలో మెళకువలతో పత్తి సాగుచేస్తే వర్షాకాలంలో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కే. మదన్ మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లిలో శనివారం అధిక సాంద్రత పద్ధతి సాగులో మెళకువలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల మధ్య 90–15 లేదా 80–20 సెంటీమీటర్ల ఎడంతో పత్తి విత్తనాలు విత్తాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సాహితి, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, రైతులు తదితరులున్నారు.

డీఎస్పీ విచారణ



విచారణ చేపడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని అనంతపల్లిలో శనివారం వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి విచారణ చేపట్టారు. తమ ఇంటికొచ్చి విష్ణువర్ధన్ రెడ్డి, ధర్మయ్య, విశాంత్, సాయి తదితరులు తుపాకులతో బెదిరించి కులంపేరుతో దూషించారని, తన కుమారుడిని చంపుతామని బెదిరించారని ఇదే గ్రామానికి చెందిన మల్లారపు కమల పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసింది. దీనిపై డీఎస్పీ నాగేంద్రచారి గ్రామంలోని కమల ఇంటి పరిసరాల్లో ఆమెతో పాటు, కుమారుడు చందుతో మాట్లాడారు. క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పలు వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట బోయినపల్లి ఎస్సై మామిడి మహేందర్ ఉన్నారు.

పట్టపగలే చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ముద్రకోల రమేశ్ తన ఇంట్లో గాజుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన నవీన్ దుబాయిలో మృతిచెందగా అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాను పగులగొట్టడంతో పాటు దుకాణంలోని రూ. 40వేల నగదు, ఐదు తులాల బంగారం, 15 తులాల పట్ట గొలుసులు చోరీ అయినట్లు గుర్తించాడు. వారం కింద మండలకేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్‌లో జరిగిన దొంగతనం మరవకముందే పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతుండటంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.

పోయిన సెల్‌ఫోన్ అందజేత

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌కు చెందిన బాబు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా.. ఆధునిక టెక్నాలజీతో ఆచూకీ తెలుసుకొని సెల్‌ఫోన్‌ను శనివారం అందించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. బాబు రెండు నెలల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో విచారణ చేసి, టెక్నాలజీ సాయంతో సెల్‌ఫోన్‌ను కనిపెట్టి అందజేసినట్లు వివరించారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో నిండు ప్రాణం బలి

- బస్వాపూర్‌లో తీవ్ర విషాదం
- కారు ఢీకొని ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- మద్యం మత్తులోనే ప్రమాదం ?



ప్రమాదానికి కారణమైన కారు



సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగిన గ్రామస్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో నిండు ప్రాణం బలైంది. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. బస్వాపూర్‌కు చెందిన గొడిసెల దేవయ్య(45), గొడిసెల పర్శరాం గ్రామ శివారులోని ప్రభుత్వ పాఠశాల దగ్గర గల కల్వర్టుపై కూర్చుని మాట్లాడుతున్నారు. అదే సమయంలో ఇల్లంతకుంట మండలం నుంచి



దేవయ్య (ఫైల్)

అతివేగంతో దూసుకొచ్చిన ఇన్నోవా కారు కల్వర్టుపై కూర్చున్న వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గొడిసెల దేవయ్య (45) అక్కడికక్కడే మరణించగా.. గొడిసెల పర్శరాం కాలు విరిగింది. దేవయ్య మృతదేహాన్ని, తీవ్రంగా గాయపడ్డ పర్శరాంను సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రి గేటు ముందు ధర్నా చేసేందుకు ప్రయత్నించారు. సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్, రూరల్ సీఐ ఉపేందర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారించారు. మృతుడు దేవయ్యకు భార్య కళవ్వ, కూతురు నేహాలత ఉన్నారు. క్షతగాత్రుడు పర్శరాంకు భార్య శిల్ప ఉంది. తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యంగా ఉండండి.. కాంగ్రెస్‌దే విజయం

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



ముస్తాబాద్‌లో నాయకులతో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన పార్టీగా కాంగ్రెస్ ప్రజల గుండెల్లో ఉందని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శనివారం పార్టీ నాయకులతో మాట్లాడారు. అనంతరం ఎల్లారెడ్డిపేటలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రజల్లోకి వెళ్తే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలను అదుపులో ఉంచలేని ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం వచ్చిందన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కే.కే.మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షులు షేక్ గౌస్, బుర్ర రాములు, నాయకులు పెద్ది శ్రీనివాస్, సంగీతం శ్రీనివాస్, ఉమేశ్‌రావు, యెల్ల బాల్‌రెడ్డి, సాహెబ్, శ్రీనాథ్, గిరిధర్‌రెడ్డి, దొమ్మాటి నర్సయ్య, లింగంగౌడ్, పొరగంటి తిరుపతి, రాజేశం, దీటి నర్సింలు, తలారి నర్సింలు, మల్లేశ్ పాల్గొన్నారు.

ఎగువమానేరుపై మంత్రి కేటీఆర్ నిర్లక్ష్యం

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టుపై మంత్రి కేటీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నారని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును సందర్శించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన తొమ్మిదో ప్యాకేజీ పనుల జాప్యంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకంలో 10, 11, 12 ప్యాకేజీ పనులు పూర్తయ్యాయని, నియోజకవర్గంలోని తొమ్మిదో ప్యాకేజీ పనులు పూర్తికాకపోవడం కేటీఆర్ అసమర్థతకు నిదర్శనమన్నారు. ఎగువమానేరు ప్రాజెక్టులోకి మల్కపేట రిజర్వాయర్ ద్వారా కాళేశ్వర జలాలు తీసుకురావాలని, ప్రాజెక్టులో పూడికను తొలగించి రెండు టీఎంసీల నీటిసామర్థ్యం ఉండేలా మంత్రి కేటీఆర్ చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయాన్ని సందర్శించి కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్ మనవడి పుట్టినరోజు వేడుకలకు హాజరై ఆశీర్వదించారు. పీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చీటి ఉమేశ్ రావు, సంగీతం శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు



మాట్లాడుతున్న కొండూరు రవీందర్ రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో అన్నదాతలకు సాగునీటిపై భరోసా కలిగిందని, వర్షాలు ఆలస్యమైనా కాళేశ్వరం నీళ్లు వస్తాయనే విశ్వాసంతో ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలోనే ప్రజల కష్టాలను గుర్తించారన్నారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో జిల్లా అన్ని రంగాల్లో ముందుందన్నారు. కేటీఆర్ సహకారంతో మండలంలోని కేజీ టు పీజీ విద్యా సంస్థలకు అనుబంధంగా త్వరలోనే శాశ్వత హాస్టల్ సమకూరుతుందన్నారు. దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటి యాదవ్, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, వైస్ ఎంపీపీ దోసల లత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఆర్‌బీఎస్ గ్రామ కో ఆర్డినేటర్ బాలకిషన్ రావు, నాయకులు రాజారాం, రామానుజా గౌడ్, రెడ్డిమల్ల రాజనర్సు, ఎగదండి స్వామి పాల్గొన్నారు.

రూ.45లక్షలతో కేడీసీసీబీ పునరుద్ధరణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేడీసీసీబీని రూ.45లక్షలతో పునరుద్ధరణ పనులు చేపట్టామని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. పునరుద్ధరణ పనులను శనివారం పరిశీలించారు. భద్రతను దృష్టిలో పెట్టుకొని దృఢమైన లాకర్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, వాచ్‌మెన్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి పాల్గొన్నారు.

కబ్జాకు కరెంట్‌షాక్



అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కబ్జాకు కరెంటు షాక్ తగిలింది. రంగంచెరువు కబ్జాకు గురైన శిఖం భూమిలో విద్యుత్ స్తంభాలు నెలకొల్పడానికి వచ్చిన సిబ్బందిని అల్మాస్‌పూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంకట్రావు దగ్గర సుమారు 45 ఎకరాల భూమి కొనుగోలు చేసిన గోవర్ధన్‌గౌడ్ చదును చేసే క్రమంలో రంగంచెరువు భూకబ్జాకు గురైందని, చెరువుకు ఉన్న కెనాల్‌ను మట్టితో కప్పి కబ్జా చేస్తున్నారని అల్మాస్‌పూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శనివారం ఆందోళనకు దిగారు. కబ్జాకు గురైన రంగంచెరువును కాపాడి తీరుతామని గ్రామస్తుల తరఫున పోరాటం చేస్తామని ప్రకటించారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

సిరిసిల్లఎడ్యుకేషన్: గీతానగర్ బాలికల ఉన్నత పాఠశాలలోని ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శనివారం డీఈవో రమేశ్‌కు టీపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్పాట్ కేంద్రం కోసం మూడేళ్లుగా పలు విధాలుగా ప్రయత్నం చేశామన్నారు. కొత్తగా ఏర్పడిన మూల్యాంకన కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

పరామర్శ

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రేపాకకు చెందిన కోదాని పోచయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి శనివారం పరామర్శించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ పోచయ్య చిన్ననాటి నుంచి కష్టపడి ఉమ్మడి కుటుంబ భారాన్ని మోసారని గుర్తు చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా సీపీఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఉన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న డీఈవో రమేశ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో రూ.10లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలకు డీఈవో రమేశ్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో గివ్ తెలంగాణ ఫౌండేషన్ సహకారంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్ అమృత, ఎంపీటీసీ తిరుపతి, ఉపసర్పంచ్ బాలు, హెచ్‌ఎం శాంత, నాయకులు రమేశ్, సుభాశ్, దేవయ్య, కనుకయ్య, శ్రీకాంత్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో నో బ్యాగ్ డే



ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. విద్యార్థులు స్కూల్‌బ్యాగులను ఇంటి దగ్గరే వదిలి పాఠశాలకు చేరుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో వ్యాయామం, ఏరోబిక్స్ చేయించారు. అనంతరం నాలుగు హౌజెస్‌గా ఏర్పరచి.. కెప్టెన్‌లను ఎన్నుకుని ప్రతిభ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు షాబుద్దీన్, శారద, రమేశ్, శ్రీనివాస్, పీఈటీ రేణుక పాల్గొన్నారు.

విద్యార్థులకు డీఈవో అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు వారి పాఠ్యాంశాలతో నూతన ఆవిష్కరణలపై ఆసక్తి కలిగి ఉండడం అభినందనీయమని డీఈవో రమేశ్ అన్నారు. స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జెడ్పీహైస్కూల్ విద్యార్థులను సిరిసిల్ల గీతానగర్ పాఠశాలలో అభినందించారు. స్టేట్ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2023 పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 13,670 ఆలోచనలు పోటీ డగా వీటిలో అత్యుత్తమ 70 ఆవిష్కరణలు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపిక చేశారు. ఈనెల 19, 20 21 తేదీల్లో హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో గ్రాండ్ ఫినాలే పోటీలు నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ 10 ఆవిష్కరణలను ఎంపిక చేయగా దమ్మన్నపేట విద్యార్థులు సుప్రియ, శ్రీ చైత్ర, రాంచరణ్, ప్రణయ్‌లు గైడ్‌టీచర్ సంపత్‌కుమార్ మార్గదర్శనంలో రూపొందించిన వంటమిత్ర అనే ఆవిష్కరణకు తొమ్మిదో స్థానం దక్కిందన్నారు. స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్‌లో సిరిసిల్ల జిల్లాకు బహుమతి రావడం ఇదే మొట్టమొదటిసారి కావడంతో డీఈఓ విద్యార్థులను గైడ్‌టీచర్లను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బోయన్న గారి నారాయణ, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారి అజీం, ఎంఈవో దూస రఘుపతి, ఉపాధ్యాయులు గోల్కొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చారు

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు



మాట్లాడుతున్న మొగిలి సునీతరావు

సిరిసిల్లటౌన్: ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణను కల్వకుంట్ల ఫ్యామిలీ అప్పుల రాష్ట్రంగా మార్చిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు విమర్శించారు. సిరిసిల్లలోని డీసీసీ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా మహిళా కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజాసంక్షేమం వెల్లివిరుస్తుండగా తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం రాజభోగాలను అనుభవిస్తుందని విమర్శించారు. మహిళల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర సర్కారు విస్మరించాయన్నారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా.. పొలిటికల్ ఏజెంట్స్‌గా పనిచేస్తున్నారని విమర్శించారు. దళితబంధు బీఆర్ఎస్ వారికి కాకుండా ఇతరులు ఎంతమందికి ఇచ్చారో తేల్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీల దోపిడీని ప్రజలు గమనించి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలోకి వస్తే అమర వీరుల కుటుంబాలకు రూ.25వేలు పెన్షన్, ఇంటికో ఉద్యోగం అందిస్తామన్నారు. రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై వివరించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, రాష్ట్ర సభ్యురాలు మడుపు శ్రీదేవి, వెల్ముల స్వరూప, గొట్టె రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- చల్మెడ లక్ష్మీనర్సింహారావు



ధర్మారంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట(వేములవాడ): కార్యకర్తలే పార్టీకి కొండంత అండ అని.. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల చైర్మన్ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో శనివారం నిర్వహించిన మండల యువ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత నలభై ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నానన్నారు. తన మెడికల్ కాలేజీ ద్వారా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఉచితంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేకే కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వేములవాడ టికెట్‌ను తనతోపాటు మరో ఐదుగురు ఆశిస్తున్నారని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. మల్కపేటలో ఇప్పటివరకు రూ.10 కోట్లు ఖర్చు చేసి పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని మరోసారి స్పష్టం చేశారు. వేములవాడ ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్ రావు, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, డైరెక్టర్లు జవ్వాజి దేవయ్య, బావుసాయిపేట ఉపసర్పంచ్ చొక్కాల దేవరాజు, యువజన నాయకులు జీవన్‌గౌడ్, రమణారెడ్డి, దుర్గం మహేశ్, కాసర్ల రాజు, యూసుఫ్, నాగేందర్, నాగరాజు, జనార్దన్, వేణు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో ఆలస్యం వద్దు

- ఈఎన్‌సీ శ్రీనివాస్‌రావు



పనులు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు, మహేందర్‌రెడ్డి, జిందం కళ, తదితరులు

సిరిసిల్లటౌన్: అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని మున్సిపల్ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. సిరిసిల్లలో కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ నిర్మితమవుతున్న ప్రభుత్వ పనులను ఓఎస్డీ మహేందర్‌రెడ్డితోపాటు నేరుగా పరిశీలించి మాట్లాడారు. నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ రూ.7.30కోట్లతో రగుడు–వెంకటాపూర్ బైపాస్‌రోడ్డు సెంట్రల్‌లైటింగ్, రూ.61.25 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రూ.6.50 కోట్లతో ఉదరకాల్వ, రూ.2.50కోట్లతో శాంతినగర్–శ్రీనగర్‌లో 60 ఫీట్ల రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులకు స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

- ఎల్లారెడ్డిపేటలో విషాదం



నవీన్ మృతదేహం వద్ద కుటుంబీకుల రోదనలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉపాధి కోసం ఏడాది క్రితం దుబాయికి వెళ్లిన వలసజీవి గుండెపోటుతో మృతిచెందగా.. ఐదు రోజుల తర్వాత శనివారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఎల్లారెడ్డిపేటకు చెందిన శివయ్యగారి నవీన్(29) ఐదు రోజుల క్రితం దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. దుబాయిలో ఉన్న ఈటీసీఏ అధ్యక్షుడు రాధారపు సత్యం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి నవీన్ మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించాడు. ఏడాది క్రితం నవీన్ పెళ్లి చేసుకుని దుబాయికి వెళ్లాడు. నవీన్ మృతదేహం ఇంటికి చేరగానే కుటుంబికుల రోదనలు మిన్నంటాయి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. నవీన్ తల్లిదండ్రులు నర్సయ్య, నర్సవ్వల రోదనలు అక్కడున్న వారిని కదిలించాయి.

మోహన్ నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

వీర్నపల్లి : మండలంలోని భూక్యతండా గ్రామపంచాయితీ పరిధిలోని రాశిగుట్టతండాకు చెందిన రమావత్ మోహన్‌నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. రాశిగుట్టతండాకు చెందిన రమావత్ మోహన్‌నాయక్ (32) గతేడాది దువాఖత్తార్‌కు వెళ్లాడు. అక్కడ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరాడు. దీనిపై ×నా భర్తను కాపాడండి¥ అనే శీర్షికన శనివారం ×సాక్షి¥లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్ రెడ్డి బాధిత కుటుంబానికి భరోసా కల్పించేందుకు వీర్నపల్లికి వచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద కొంత ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆస్పత్రిలో వైద్య ఖర్చులతో పాటు అతనిని స్వదేశానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చూడాలన్నారు.

గుడుంబా విక్రయదారుల బైండోవర్

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలో గుడుంబా విక్రయిస్తున్న నలుగురిని ఎక్సైజ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ప్రవర్తనలో మార్పు కోసం తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్ ఎదుట శనివారం బైండోవర్ చేశారు.